విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 01 ఆగస్టు 2025 8 పేజీలు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- నరేంద్రపురం, నందరాడ గ్రామ రైతు సేవా కేంద్రాల ఆకస్మిక తనిఖీలు
- రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర - రాజానగరం : రైతు సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని నందరాడ, నరేంద్రపురం గ్రామ రైతు సేవా కేంద్రాలను కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, డేటా ఎంట్రీ, ఇతర అనుబంధ కార్యకలాపాల తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం అమలును దృష్టిలో పెట్టుకొని ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సమర్థవంతంగా చేరాలంటే, క్షేత్రస్థాయి రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. నందరాడ, నరేంద్రపురం గ్రామ రెవెన్యూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం నందరాడ వీఆర్వో సిహెచ్. ముని తిరుపతి, దివాన్ చెరువు-3 కు చెందిన వీఆర్వో ఎం.సత్యనారాయణ(నరేంద్రపురం గ్రామ ఇంచార్జి) తీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వెంటనే కలెక్టరేట్‌కు వారిని అటాచ్ చెయ్యాలని తహసీల్దార్ జి.అనంత లక్ష్మీ సత్యవతి దేవికి ఆదేశాలు జారీ చేశారు.

రేపు రైతు ఖాతాల్లో పీఎం కిసాన్ బదిలీ

తూర్పు గోదావరి జిల్లాలో అర్హులైన ప్రతిఒక్క రైతు ఖాతాల్లో నేరుగా పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం కలిపి ఏడు వేల నగదు జమచేస్తామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ , ఆగస్టు 2వ తేదీన అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాల్లో రూ.7,000 (పీఎం కిసాన్ యోజన కింద రూ.2,000), అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5,000 నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, రాజానగరం తహసీల్దార్ జి.ఎల్.ఎస్. దేవి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బోధనలో కొత్తదనం

- ఉపాధ్యాయులకు కరదీపికల పంపిణీ
- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి
- ఏకోపాధ్యాయులపై పెరిగిన భారం

విశాలాంధ్ర -కొయ్యలగూడెం: విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక (టీచర్ హ్యాండ్ బుక్స్)లను అందిస్తుంది. ఎస్సీఈఆర్టీ సహకారంతో సమగ్రశిక్ష ద్వారా సామర్థ్య ఆధారిత బోధన, అభ్యసన ఉపాధ్యాయ వనరుల పేరుతో వీటిని రూపొందించింది. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, విద్యాప్రమాణాలు పెంచేలా ఇవి రూపుదిద్దుకున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలలకు కరదీపికలను అధికారులు పంపిణీ చేశారు.

అకడమిక్ క్యాలెండర్‌తో అనుసంధానం

కరదీపికలను అకడమిక్ క్యాలెండర్‌లోని పని దినాలతో విద్యాశాఖ అధికారులు అనుసంధానం చేశారు. ఏరోజు ..ఏ పాఠం..ఏ అంశం..ఎలా చెప్పాలో తేదీలతో సహా అందులో పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలలో ఒకేరోజు ఒకే పాఠం బోధనలో ఉంటుంది. పాఠం పూర్తయిన తర్వాత ప్రతి పిరియడ్‌లో బోధన సమయం, ఉపయోగించిన టి.ఎల్.ఎం., అభ్యసనా కృత్యాలు, రిమార్కులను ఉపాధ్యాయులు కరదీపికలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా తరగతులలో సబ్జెక్టుకు సంబంధించిన ఓ పుస్తకం ఉంటుంది. ఈ పుస్తకాలను తొలుత ▶మిగతా 2లో..

రేపు 'అన్నదాత సుఖీభవ'

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర -నూజివీడు: ఆగస్టు 2వ తేదీ నుంచి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలో 46.85 లక్షల మంది రైతులకు రూ.3,174.40 కోట్లు ఆర్థిక సాయం అందజేయనున్నట్టు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం వివరాలను తెలియజేస్తూ తొలివిడతలో కేంద్రం అందజేసే రూ. 2 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేలు కలిపి మొత్తం రూ. 7 వేలు అందిస్తామన్నారు. 2వ విడతలో మరో రూ. 7 వేలు, 3వ విడతలో రూ. 6 వేలు ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అర్హులైన ▶మిగతా 2లో..

కార్మికుల ఆరోగ్యానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

కార్మిక శాఖ మంత్రి సుభాష్

విశాలాంధ్ర - రాజమండ్రిసిటీ : కార్మికుల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రాష్ట్రకార్మిక, కర్మాగార , బాయిలర్స్ అండ్ వైద్య భీమా సేవ శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం స్థానిక శ్రీరామ్‌నగర్ ప్రాంతంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి అంబులెన్స్ ను బహుకరించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబులెన్స్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కార్మికులు ఊచకోతకు గురయ్యారని అన్నారు. తాము కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండు నెలల కిందట ఈఎస్ఐ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించి కొంతమందిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఆనాటి నుంచి సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని , ప్రస్తుతం 250 నుంచి 300 ఓపీలు వస్తున్నాయని, ఇది రాజమండ్రి ఈఎస్ఐ చరిత్రలో ఓ రికార్డు అని అన్నారు. ప్రస్తుతం బహుకరించిన అంబులెన్స్ అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుందని, అంబులెన్స్‌లో స్పెషలిస్టును కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కర్నూలు, గుంటూరులలో కొత్త ఆసుపత్రుల నిర్మాణానికి స్థలాన్ని కూడా సేకరించామని, అమరావతిలో ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని ▶మిగతా 2లో..

అదాని కోసమే పేదలపై భారాలు

ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ వేదిక

విశాలాంధ్ర-ఏలూరు: అదాని కోసమే పాలకులు ప్రజలపై భారాలు వేస్తున్నారని ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక పేర్కొంది. ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో గురువారం మూడవరోజు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్,జిల్లా పరిషత్, ఇండోర్ స్టేడియం మీదుగా కోర్టు సెంటర్ నుండి ఫైర్ స్టేషన్ వరకు సంతకాల సేకరణ కొనసాగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అదానికి వేల కోట్ల రూపాయలు దోచిపెట్టడానికే ప్రజలపై వివిధ రూపాలలో భారాలు వేస్తున్నారని విమర్శించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం సెకి సంస్థ ద్వారా 25 సంవత్సరాల పాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు చీకటి ఒప్పందం చేస్తుందని విమర్శించారు. ఈ ఒప్పందం వల్ల రాబోయే 25 సంవత్సరాల కాలంలో రూ.1.2 లక్షల కోట్ల భారం ప్రజలపై ▶మిగతా 2లో..

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యంతో పీ4 కార్యక్రమం లక్ష్యాలను చేరుకునేందుకు గ్రామ సభలు సర్వేలు నిర్వహణ ద్వారా బంగారు కుటుం బాల అవసరాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలు సాధన పి4 సర్వే, బంగారు కుటుంబాల దత్తత, పాజిటివ్ పబ్లిక్ సంతృప్తి స్థాయిల పురోగతి, త్రాగునీటి చెరువుల నవీకరణ నూతన చెరువుల ప్రతిపాదనల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 65 వేల బంగారు కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 27 వేల బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 19 మార్గదర్శులను ▶మిగతా 2లో..

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర -భీమవరం: పరిపాలన రంగంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే సమాజ ప్రగతి అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు భాగం పంచుకోవాలని అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు ఎల్లప్పుడూ ముందుండి సహకారాలను అందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ, టివివి ప్రసాద్, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

తుందుర్రులో సుపరిపాలన తొలి అడుగు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి గురువారం టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట సీతా రామలక్ష్మి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తు చేశారు. సూపర్ 6 హామీలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 46.50 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా మొదట విడతగా రూ.7 వేలు, రెండో విడతగా రూ.7వేలు, మూడో విడతగా రూ.6 వేలు మొత్తం 20 వేల రూపాయలను రైతుల ఖాతాకు జమ చేయనున్నారని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత సామాజిక పెన్షన్లను పెంచి వృద్ధులకు 4 వేల రూపాయలు, వికలాంగులకు 6 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు15 వేల రూపాయలు ప్రతినెల 1వ తేదీన వారి ఇంటి వద్దకు వెళ్లి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, అగ్ని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నాగిడి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పీ4 (1వ పేజీ తరువాయి)

గుర్తించినట్లు తెలిపారు. నిర్దేశిత ప్రగతి లక్ష్యాల మేరకు స్వర్ణాంధ్ర సాధనకై అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వాడకం రవాణా అరికడుతూ డి అడిక్షన్ కేంద్రాల ద్వారా పూర్తిగా మత్తు పదార్థాల వాడకం నిరోధానికి కృషి చేయాలన్నారు. త్రాగు, సాగు నీటి సంరక్షణపై దృష్టి సారించి వర్షపు నీటిని ఒడిసిపెట్టి నీటిని సమృద్ధిగా నిల్వ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డ్వామా పిడి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, సిపిఓ మురళీ కృష్ణ, డిపిఓ శాంత లక్ష్మీ తది తరులు పాల్గొన్నారు.

పేరు మార్పు

ఏలూరు జిల్లా, ఏలూరు పట్టణము, తంగెళ్లముడి, బడేటినగర్‌లో గల డోర్ నెంబరు. **16B-14-35/1లో** నివానం ఉంటున్న **Mahammad Akbar, S/o. Md Vahidjuma Shareef** అను నేను నా పేరును **Mohammad Akbar** మార్చుకున్నాను. పాస్‌పోర్టుతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం నా పేరును **Mohammad Akbar** మార్చుకున్నాను.

వృద్ధ కళాకారులను ఆదుకోండి

విశాలాంధ్ర-ఏలూరు: వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టి.వీ.ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటు, ఎమ్మెల్యేలకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వాలు కళనే నమ్ముకుని కళాకారుడుగా జీవితాన్ని గడుపుతున్న వృద్ధ కళాకారుల పెన్షన్ ప్రస్తుతం ఇస్తున్న రూ.4 వేలకు బదులుగా రూ. 10వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు పాలకులకు పలుమార్లు కళాకారులు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా చీమ కుట్టినట్టైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యేలుగా పనిచేసిన ప్రజాప్రతినిధులకు కూడా ప్రభుత్వం నుండి ఆర్టిసి బస్సు ప్రయాణం ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వాలు,తమ జీవితాన్ని కళకు అంకితం చేసిన కళాకారులను నిర్లక్ష్యం చేయడం సరైన చర్య కాదన్నారు. వృద్ధ కళాకారులకు కూడా ఆర్టీసీ, రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 20 సంవత్సరాలు రంగస్థలం కళాకారునిగా కాళ్లకు గజ్జ కట్టి జానపద పౌరాణిక సాంఘిక నాటకాలలో 80 సంవత్సరాలు వచ్చేవరకు రంగస్థలం కళాకారునిగానే జీవితం గడుపుతూ నేడు అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో మంచానికి పరిమితమైన వృద్ధ కళాకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పనిచేస్తున్నాం (1వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. యలమంచిలిలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందని, ఆగస్టు కానీ, సెప్టెంబర్ నెలలో కాని రాజమండ్రిలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామన్నారు. యూనియన్ బ్యాంకు వారి సహకారంతో సుమారు రూ.42 లక్షలతో అంబులెన్స్ ను రాజమండ్రి ఇఎస్ఐ కు సిఎస్ ఆర్ ఫండ్స్ కింద బహూకరించినట్టు తెలిపారు. దీనికి బ్యాంకు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ డైరెక్టర్ వి. ఆంజనేయులు , డాక్టర్లు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారాలు (1వ పేజీ తరువాయి)

పడుతుందని ఆనాడు స్వయంగా చంద్రబాబు తన శ్వేత పత్రంలో ప్రకటించారని తెలిపారు. నేడు అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలని నేడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణం స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమాలతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు అవుతున్నారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తూ స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళు తున్నారని విమర్శించారు. ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వద్దు పాత మీటర్లు ముద్దు అనే నినాదం తీసుకుని స్మార్ట్ మీటర్లను బిగిస్తే ప్రజలంతా వ్యతిరేకించండి, మా ప్రభుత్వం వస్తే స్మార్ట్ మీటర్లను బిగించే పద్ధతి ఉండదని వాగ్దానం చేసి నేడు అధికారంలోకి రాగానే ప్రజలపై సర్ చార్జీల పేరుతో పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్ మాట్లాడుతూ తక్షణం అదాని స్మార్ట్ మీటర్లు ఆపాలని,పెట్టిన మీటర్లు తొలగించాలని, ట్రూ అప్ ఇంధన సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఏఐటియుసి నగర అధ్యక్షులు కొంపల్లి కృష్ణమాచార్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, గొర్లి స్వాతి, సాయన అభిలాష్ కుమార్,వెదురుపర్తి శారద,లక్కోజు జగదీశ్వరి, ముదుపాక ధనలక్ష్మి, వెదుపర్తి లక్ష్మి, బుగ్గల ప్రభాకర్, కె.ప్రసాద్,రైతు నాయకులు జి. కోటేశ్వరరావు,ఐఎఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, పిడిఎస్యు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కాకి నాని,రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్,వివిఎన్ ప్రసాద్ మెడికల్ రిప్రజెంట్ రాష్ట్ర నాయకులు వివిఎన్ ప్రసాద్, ఎం.ఇసాక్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జి. శివకుమార్, సత్య నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

సుఖీభవ (1వ పేజీ తరువాయి)

రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందుతుందన్నారు.
ఈ నగదు జమవల్ల వేలాది రైతులకు ఉపశమనం కలగనుందన్నారు. ఏలూరు జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 1,51,694 మంది రైతులు ప్రయోజనం పొందుతారన్నారు.
నూజివీడు నియోజకవర్గంలో 33,405 మంది రైతుల ఖాతాలకు ఆగస్టు 2వ తేదీనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమకానుందన్నారు.

కొత్తదనం (1వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు క్షుణ్ణంగా చదవాల్సి ఉంటుంది. దీని ద్వారా పిల్లలకు సులభతరంగా బోధన అందించేందుకు నోట్స్,ప్రశ్నాపత్రాలను తయారు చేసుకునేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏకోపాధ్యాయులపై భారం

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధించే ఏకోపాధ్యాయులపై కరదీపికలు మరింత భారం కానున్నాయి. ఐదు తరగతులకు మొత్తం 18కర దీపికలను అధికారులు పంపిణీ చేశారు. కరదీపికలో సూచించిన మాడ్యూల్ విధానంలో ఒకేరోజు ఐదు తరగతులకు బోధించడం తమ వల్ల సాధ్యం కాదని ఏకోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన తరువాత విద్యార్థుల హాజరు,ఎండిఎం భోజనాల ఫోటోలను యాప్‌లో అప్ లోడ్ చేయాలని, ఎం.ఆర్.సి., నుంచి వచ్చే మార్గదర్శకాలను పాటించాలని, మరొకవైపు బోధన చేపట్టాల్సి ఉంటుందని వారు అంటున్నారు. ఇప్పుడు కరదీపికలో సూచించిన మాడ్యూల్ విధానంలో బోధన అంటే తమపై మరింత భారం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. ఏకోపాధ్యాయుల విషయంలో జిల్లా విద్యాశాఖ సరైన ప్రణాళిక రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

నకిలీ ఎరువుల పట్టివేత

విశాలాంధ్ర-లింగపాలెం: నకిలీ కాంప్లెక్స్ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు యడవల్లిలో పట్టుకున్నారు.నకిలీ ఎరువుల ధర దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.మైలవరం నుంచి మినీ వ్యానులో చింతలపూడి తరలిస్తుండగా యడవల్లి వద్ద వీటిని పట్టుకున్నారు. ఈ దాడిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాష, చింతలపూడి వ్యవసాయ శాఖ సహాయ అధికారి సుబ్బారావు, చింతలపూడి, లింగపాలెం మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ప్రదీప్ కుమార్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. పట్టుకున్న ఎరువులను, మినీ వాహనాన్ని సీజ్ చేశారు. వీటిపై కేసు నమోదు చేశారు.నకిలీ ఎరువులు తరలిస్తున్న వారికోసం దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల కాలంలో నకిలీ ఎరువులు, పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. వీటిపై సరైన పర్యవేక్షణ లేదని విమర్శలు కూడా ఉన్నాయి. యడవల్లిలో నకిలీ కాంప్లెక్స్ ఎరువులను పట్టుకోవటం సంచలనం అయ్యింది. దీనిపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక వాస్తవాలు వెలుగు చూస్తాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మొబైల్ వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర-లింగపాలెం: మొబైల్ ఫోనుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలను వివరిస్తూ ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ సదస్సులో ఎస్సై వెంకన్న బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మొబైల్ ఫోను వల్ల కలిగే లాభ,నష్టాలను వివరించారు. అనవసరంగా మొబైల్ను వినియోగించవద్దని, అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మొబైల్ ఫోన్ వల్ల జరిగే సైబర్ నేరాలు విద్యార్థులకు తెలిపారు. ప్రతి విద్యార్థి ఇటువంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. మొబైల్లో పలు చెడు యాప్‌లు వస్తుంటాయని వీటిని వినియోగించవద్దని తెలిపారు. విజ్ఞానానికి సంబంధించిన యాప్ లను మాత్రమే వినియో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చలసాని రత్నాకర్ విద్యార్థులతో మొబైల్ వినియో గంపై కలిగే లాభనష్టాలపై మాట్లాడించారు. విద్యార్థులు ఈ సందర్భంగా తమ అనుభవాలను తెలిపారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సర్పంచులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా గ్రామపంచాయతీ అధికారి (డిపిఓ) ఎన్. రామనాథరెడ్డి అన్నారు. గురువారం గణపవరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ పన్నులు, పనితీరు, లైసెన్స్ ఫీజుల వివరాలు పరిశీలించారు. గ్రామంలో నీటి సరఫరా వివరాలు పారిశుద్ధ్య పనుల వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలంకారం, ఎంపిడిఓ ఆర్. బేబీ శ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఓ పల్లి వెంకట సత్యనారాయణ, జనసేన నాయకులు తోట శ్రీను, వీరంకి శ్రీను, పంచాయతీ కార్యదర్శి దార్ల శివ రామ ప్రసాద్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: అదానీ స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైఎస్సార్ సీపీ యువ నేత పెండ్యాల అభిషేక్ బాబు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజలు ఇప్పటికే అప్పులతో, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతుంటే మూలిగే నక్క పై తాటికాయ పడినట్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటికి, షాపులకు అదానీ కరెంట్ స్మార్ట్ మీటర్లను బిగించడం అంటే ప్రజలపై

మరింత భారాన్ని మోపడమే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు ఒక్క పైసా పెంచబోమని చెప్పి దాదాపు 13 సార్లు పెంచి మాట తప్పారని విమర్శించారు. సామాన్యులకు, వ్యాపారులకు ఇది మోయలేని భారంగా ఉందని అన్నారు. సెల్‌ఫోన్ రీఛార్జ్ చేయించుకున్నట్లు ముందుగానే కరెంట్ బిల్లు రీఛార్జ్ చేయించుకోవడం అన్యాయం అన్నారు. కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీలు పేరుతో, కస్టమర్ ఛార్జీలు,వడ్డీ ఛార్జీలు తదితర పేర్లతో అదనపు చార్జీలు ప్రజల నుండి ముక్కు పిండి వసూలు చేస్తుందని, ప్రజలందరూ గ్రహించి,స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-టీ నరసాపురం: మండలంలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం నియోజకవర్గ పాస్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహశీల్దార్ టి.సాయిబాబాను కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చి స్థల వివాదంపై తహశీల్దార్‌తో చర్చించడంతో

ఆయన సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గం పాస్టర్ల జెఏసి కార్యదర్శి కురసం నిరీక్షణరావు, మండల కార్యదర్శి బి.కిషోర్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ హొషేయలు మాట్లాడుతూ మండలంలో పాస్టర్ల సమావేశ మందిరం కొరకు స్థలం ఏర్పాటు చేయాలని, అర్హులైన పాస్టర్లకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దార్ పేర్కొన్నారని తెలిపారు. స్థానికంగా చర్చి స్థల వివాదాన్ని పరిష్కరించి నందుకు పాస్టర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఏసి కమిటీ సభ్యులు జి. జ్ఞాన్ రాజు, ప్రకాష్ బాబు, యోహోషువ, శ్యాం ప్రసాద్, అకుల, ప్రసన్నరాజు, జాన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ(డిడిఆర్‌సి) సమావేశం ఈనెల 2వతేదీ శనివారం నిర్వహించనున్నారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో 2వ తేదీ ఉదయం గం.10 నుంచి జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి, ఎంపి, శాసనసభ్యులు,ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు పాల్గొంటారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఉపాధిహామి, ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బి. తదితర శాఖలు చేపట్టిన పనుల ప్రగతిపై సమీక్షిస్తారు.

ఏడుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టీ నరసాపురం: పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో గురువారం దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి 43 వేల రూపాయల నగదు, నాలుగు మోటర్ సైకిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: ఆగస్టు 19, 20వ తేదీల్లో తణుకులో జరుగనున్న సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి 27 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ శ్రేణులు గురువారం పట్టణంలో గడప గడప ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి సభల నిర్వహణకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కలిశెట్టి మాట్లాడుతూ 19న తణుకు పట్టణంలో జరుగనున్న ప్రజాప్రదర్శన, బహిరంగ సభలకు అధిక సంఖ్యలో సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా ఆగస్టు 19 న తణుకులో జరిగే ప్రజాప్రదర్శన, బహిరంగ సభ, 20న జరిగే ప్రతినిధుల సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తదితరులు హాజరవుతారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను

అమలు చేయడంలో కూటమి సర్కారు వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఇళ్ల స్థలాలు,రేషన్ కార్డులు,పింఛన్లు కొరకై పేదలతో కలిసి ఎన్నో ఉద్యమాలు నిర్వహించామని, మరిన్ని ఉద్యమాలు చేపట్టడానికి తణుకు మహాసభల్లో రోడ్ మ్యాప్ రూపొందిస్తామని మండల నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ, మహిళా సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యర్రంశెట్టి శాంతమణి, లంక సీతమ్మ, జుత్తుగ నాగమణి, వడ్డాది మేరి, జగ్గు సీత తదితరులు పాల్గొన్నారు.

4న చలో విజయవాడకు తరలిరండి

నైట్ వాచ్మెన్ కమిటీ ఏలూరు జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలో కాపలాదారులుగా పనిచేస్తున్న నైట్ వాచ్మెన్ల 5నెలల జీతాల కోసం ఈ నెల 4 న విజయవాడ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ నైట్ వాచ్మెన్‌ల కమిటీ (ఏఐటియుసి)ఏలూరు జిల్లా కన్వీనర్ కంకిపాటి బుచ్చిబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం హైస్కూల్లో చదువు కొనే విద్యార్థినీ, విద్యార్థులకు ఇంటర్నెట్ ద్వారా చదువు చెప్పేందుకు కంప్యూటర్ పరికరాలు, భద్రపరిచే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 5333 హైస్కూల్స్‌కు సంబంధించి నైట్ వాచ్మెన్లను నియమించిందన్నారు. అప్పటి ప్రభుత్వం సాయంత్రం గం.4నుండి మరుసటి రోజు ఉ:గం.9ల వరకు గౌరవవేతనం పేరుతో నెలకు రూ.6వేలు ప్రకటించింద న్నారు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 5 నెలల నుండి వేతన బకాయిలు చెల్లించక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధి కారులను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తప్పనిసరి పరిస్థితులలో ఈనెల 4వ తేదీన జరుగబోయే ధర్నాకు కార్మికులందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నైట్ వాచ్మెన్ ఏలూరు జిల్లా కో కన్వీనర్ కే వెంకటేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర-చింతలపూడి : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాఘవపురం గ్రామంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సీపీఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా నాయకులు డి. రంగనాథ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజావేదిక పిలుపులో భాగంగా ఆగస్టు 5వ తేదీన జరిగే ధర్నా జయప్రదం చేయాలని తెలిపారు. చింతలపూడి మండలంలో నాలుగవ రోజు సంతకాల సేకరణ రాఘవపురం గ్రామంలో చేపట్టామని అన్నారు. ప్రజలంతా భాగస్వాములై ఆగస్టు 5వ తేదీన జరిగే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సంతకాల సేకరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్.కె కాలేశా, సీపీఐ ఎండపల్లి గ్రామ కార్యదర్శి ఎస్కే మస్తాన్, నాయకులు మోర్తా లక్ష్మణరావు, తాడిగడప మాణిక్యాలరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం 132 కె.వి.సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం భీమవరం పట్టణం, భీమవరం రూరల్, పాలకోడేరు, వీరవాసరం మండలంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగు తుందని విద్యుత్ ఈఈ ఎన్.వెంకటేశ్వర రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం: ఆగస్టు 19, 20 తేదీల్లో తణుకులో జరుగనున్న సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి 27వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. గురువారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో

మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ 19న తణుకు పట్టణంలో జరుగనున్న ప్రజాప్రదర్శన, బహిరంగ సభలకు అధిక సంఖ్యలో సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా ఆగస్టు 19 న తణుకులో జరిగే ప్రజాప్రదర్శన, బహిరంగ సభ, 20 న జరిగే ప్రతినిధుల సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తదితరులు హాజరవుతున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు ముఖ్యంగా పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ అమలు తదితర అంశాలపై చర్చించి మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్టు చెల్లబోయిన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, విజయ్, సత్యనారాయణ, జోసెఫ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు

విశాలాంధ్ర - నరసాపురం: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ మంచి గుర్తింపు ఉంటుం దని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకట రమణ అన్నారు. నరసాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీపూడి రవిబాబు గురువారం పదవీ విరమణ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ ఎం.అంజయ్య అధ్యక్షతన నిర్వహించిన సభకు వెంకట రమణ ముఖ్య అతిథిగా మాట్లాడారు. మున్సిపల్ రీజనల్ డైరక్టర్ నాగ నరసింహారావు మరో అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పద న్నారు. సర్వీస్‌లో అందజేసిన సేవలు అమూల్యమైన వన్నారు. అనంతరం రవిబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ యూనియన్ నాయకులు కృష్ణ మోహన్, డీఈ ప్రసాద్, గణేష్ బాబు, శివగాయత్రి, టీపీఓ ఎంవీ.రమణ, ఎంవీవీ సత్య, ఏఈ నవ్య, కిశోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ వ్యవస్థ ఎంతో ఉపయోగం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థ విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ, యువకులకు ఎంతో ఉపయోగకరమని శిక్షణా ఫౌండేషన్ జిల్లా మాస్టర్ ట్రైనర్ దిర్శిపాం సత్య నారాయణ (అన్నవరం) అన్నారు. ద్వారకా తిరుమల గ్రంథాలయానికి బెంగుళూరు శివశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శిక్షణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2 కంప్యూటర్లు, ఒక స్మార్ట్ ఫోన్, స్మార్ట్ టివి

ఉచితంగా ఇచ్చారు. సుమారు రూ.2.02లక్షలు విలువ చేసే వీటిని గ్రంథాలయ అధికారి ఎస్.సీహెచ్.రామకృష్ణకు అన్నవరం చేతుల మీదుగా గురువారం అందజేశారు. త్వరలో గ్రంథాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పాకనాటి భరత్, పాకనాటి బ్రహ్మయ్య, ఒబిలిశెట్టి బుబ్బారావు, రాజేశ్వరి, మణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

విశాలాంధ్ర-చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీలో ప్రజలకు వైద్య సేవలు అందు బాటు లోనికి తీసుకురావాలని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో కొత్త బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సన్ లైఫ్ హాస్పిటల్‌ను రోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, చింతలపూడి మాజీ శాసనసభ్యులు మద్దాల రాజేష్ కుమార్ హాజరయ్యారు. చింతలపూడి శాసనసభ్యులు మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీలో ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకు వచ్చిన సన్ లైఫ్ యాజమాన్యానికి, డాక్టర్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు శాసనసభ్యులు బోర్ల రామాంజ నేయులు మాట్లాడుతూ సన్ లైఫ్ హాస్పిటల్‌లో అత్యధిక సౌకర్యాలతో చింతలపూడి ప్రజలకు అందుబాటులో ఉందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య కుమార్, డాక్టర్ మద్దాల జ్యోత్స్న, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

180 పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల వ్యాప్తంగా వితంతు పెన్షన్లు 180 మంజూరైనట్టు కొయ్యలగూడెం మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న అన్ని సచివాలయాల పరిధిలోని అర్హత కలిగిన లబ్దిదారులకు నేడు పింఛన్ అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర -భీమవరం: ఆగస్టు 2న పశ్చిమగోదావరిజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే ధర్నా విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. ఫ్యాప్టో ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ సన్నా హక సమావేశం గురువారం యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్ బకాయిలతోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో ఆగస్టు 2న భీమవరం కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపడతా మన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ పెన్మెత్స విజయరామరాజు సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం, కో చైర్మన్ పెన్మెత్స ఆర్ వి ఎస్ సాయి వర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణారావు, కోచైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గోపీ మూర్తి మద్దతు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరుగు ధర్నా కు పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన భీమవరంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

విశాలాంధ్ర-ఏలూరు: అర్హులైన ప్రతీ రైతుకు'అన్నదాత సుఖీభవ'పథకం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం అమలుపై గురువారం సచివాలయం నుండి వివిధ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

ఏలూరు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీన 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కింద 3174. 4 కోట్ల రూపాయలను రాష్ట్రంలోని 46 లక్షల 85 వేల 831 మంది రైతులకు అందించ నున్నట్టు తెలిపారు. 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం 5 వేల రూపాయలు చొప్పున, కేంద్ర ప్రభుత్వం 2 వేల రూపాయలు చొప్పున మొత్తం 7 వేల రూపాయలను అర్హులైన రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అర్హుడైన చివరి రైతు వరకు 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకాన్ని వర్తింపచేయా లన్నారు. 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కార్యక్రమాన్ని జిల్లా, గ్రామ స్థాయిలో పండుగ వాతావరణంలో నిర్వ హించాలని, ప్రజాప్రతినిధులను, రైతులను భాగస్వాములను చేయాలన్నారు. నీటి పరిరక్షణ, నీటి నిర్వహణ ప్రధానమైనదని, రాష్ట్రంలో ప్రస్తుతం సగటు వర్షపాతం తక్కువగా ఉన్నందున ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కలెక్టర్లు సాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం అమలయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ నాగార్జున, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు,సిపిఒ వాసు దేవరావు, పశుసంవర్ధక శాఖ,మత్స్య శాఖ జెడి డా.గోవిందరాజులు, సర్పయ్య, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిపిఒ కె. అనురాధ, డిఎంహెచ్ఓ డాక్టర్ పి.జె.అమృతం,ప్రభృతులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలతో
ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విఘాతం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఉమ్మడి సర్వీస్ రూల్స్ కు విఘాతం కలిగించే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల జడ్పీ, ఎంపీపీ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ గుగులోతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆయా యాజమాన్యాల పరిధిలోనే పర్యవేక్షణ అధికారులను నియమించి డిడిఓ అధారిటీ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో పనిచేస్తున్న టీచర్లను పర్యవేక్షించే అధికారం ఆ యాజమాన్యంలోని హెచ్ఎంలకు మండల విద్యాశాఖ అధికారులుగా నియమించాలని కోరారు. ఏపీపీఎస్సీ ద్వారా నియమించ బడిన ఉపాధ్యాయులే ప్రభుత్వ ఉపాధ్యాయులని మిగిలిన వారందరూ జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన డిస్టిక్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా ఎంపికై వారి అనుకూలత ప్రకారం ఆనాటి ఖాళీలలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపాలిటీలలో వారి ర్యాంకుల ఆధారంగా ఆప్షన్ల ద్వారా ఉపాధ్యాయు లుగా విధుల్లో చేరి ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులని వారికి మాత్రమే ఎంఈఓ, డిప్యూటీఈవోలుగా బాధ్యతలను అప్పగిస్తామని అధికారులు ఏ విధంగా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సంబంధించి 72, 73, 74 జీవోలు అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వ అధికారులే సమన్యాయాన్ని పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అందువల్ల ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకొని ఉమ్మడి సీనియార్టీ ద్వారా మాత్రమే ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

In The Court Of The III Addl Civil Judge (Junior Division) at Vijayawada

O.S. No. 1764/2022

Between :
M/s Lakshmi Finance Pvt Ltd.,
Reb by its Authorized Person Gorrela Suresh
... Plaintiff

And

Marampudi Narasimha Rao and Another
... Defendants

To : ప్రతివాది నెం : 1
Marampudi Narasimha Rao, S/o Peddi Raju, Dr No. 1-177, Bobbanapalli Village, Tundurru, Veeravasaram Mandal, West Godawari Dt- 534207

ప్రతివాది నెం : 2
Medida Ajay, S/o Mohana Rao, Dr No. 1-25, Bobbanapalli Village, Tundurru, Veeravasaram (M), West Godawari Dt- 534207

పై నెంబరు దావా ప్రొసీడింగ్స్‌లో ఒకటి మరియు రెండవ ప్రతివాదికి వాది పంపిన నోటీసులు అందకపోవుటవలన పై తెలిపిన కోర్టునందు ది. 22-08-2025న తేదీన ఉదయం 10.30 గం॥లకు ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కానిచో సదరు దావా ప్రొసీడింగ్స్ మీ పరోక్షముందు తీర్మానించ గలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 22-08-2025

I.Venkateswara Rao, B.Com, B.L.
I.Vikram Kumar, B.A., L.L.B., Advocates
29-27-66, Surayanarayana Street,
Suryaraopet, Vijayawada- 520 002.
Cell : 98481 50815, 95023 68338

జాతీయ రహదారి-16పై రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఏపీలోని గన్నవరం - నల్లజెర్ల మధ్య జాతీయ రహదారి-16పై రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని పార్లమెంట్ వర్షాకాలం సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా హైవేల మంత్రి నితిన్ గడ్కరీ గురువారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గన్నవరం నుండి నల్లజెర్ల వరకు జాతీయ రహదారి-16పై సగటున ప్రతి రోజు రోడ్డు ప్రమాదం జరుగుతున్న విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాలేదని, రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి సమీకరించిన సమాచారం ఆధారంగా భారత దేశంలో రోడ్డు ప్రమాదాలు' అనే వార్షిక నివేదిక రూపొందిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

గన్నవరం - నల్లజెర్ల మధ్య మార్గాన్ని కాంట్రాక్టర్లు, కన్సెషనర్లు ఒప్పంద నిబంధనల ప్రకారం ట్రాఫిక్‌కు అనువుగా నిర్వహిస్తున్నారని, కొన్ని చోట్ల భూముల సెటిల్‌మెంట్లు ఏర్పడినప్పుడు వెంటనే వాటిని సరి దిద్దే చర్యలు తీసుకుంటున్నా రని కేంద్ర మంత్రి బదులిచ్చారు. ప్రమాదాలను నివారించడానికి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, భద్రత వంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కూటమి కృషి

విశాలాంధ్ర - నరసాపురం: రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్ ఎంఎ షరీఫ్ అన్నారు. నరసా పురం పట్టణంలోని 13వ వార్డులో గురువారం నిర్వ హించిన 'సుపరి పాలన తొలి అడుగు' కార్యక్రమంలో మాట్లాడారు.

అనంతరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, అధికారి అనంతరామారావు, కౌన్సిలర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ) సంకు భాస్కర్ నాయుడు, షేక్ యూనిస్ బేగం, గుడాల సునీత, దొంగ పద్మారావు, మోకా శ్రీను, షేక్ హుస్సేన్, తిరుమాని హేమంత్, తిరుమాని ఏడుకొండలు, పాలూరి విగ్నేశ్వర ప్రసాద్, మావూరి ఆనంద్, బందారు ప్రసాద్, యలమంచిలి విజయ్, కొప్పాడ ఉమ మహేశ్వరరావు, నాగిడి రాంబాబు కొప్పాడి సత్యనారాయణ, ఉల్లంపర్తి సత్యన్నారాయణ, గుడాల రామకృష్ణ, జెట్ల నాగేశ్వరరావు, మల్లాడి మూర్తి,దేశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలో ఏలూరు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 2న నిర్వహించనున్న చలో ఏలూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం గడుస్తున్నా, పేరుకుపోయి ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ ధర్నా చేపట్టామని తెలిపారు. 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, జె ఆర్, కారుణ్య నియామకాలు, మెమో నెంబర్ 57 అమలు, పెండింగు బకాయిలు, సమాంతర మీడియం బోధనేతర కార్యక్రమాల నుండి విముక్తి, తదితర సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2న జిల్లాకేంద్రాలలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి. లక్ష్మణరావు, వాకాడ గణేష్, కొనకళ్ళ కృష్ణారావు, వేల్పుల రవికుమార్, జరభల శివకుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రాజమహేంద్రవరమే లక్ష్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పర్యాయ పదంగా నిలుస్తుందని, ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా జరుగుతున్న అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే సుందరమైన నగరాన్ని ప్రజలు చూస్తారని అన్నారు. స్థానిక కోరుకొండ రోడ్డు లోని శ్రీ వెంకటస్వామి ఆలయం వద్ద 44వ డివిజన్లో రూ. 27 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ఏ ప్రాంతంలో చూసినా ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నగరాభివృద్దే ధ్యేయంగా తాము పని చేస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జెవన్ రోడ్డు వంటి ప్రధాన మార్గాల్లోనే అవసరం లేక పోయినా డివైడర్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించారని మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పదకొండు నెలల్లో తాము మార్పు చేసి చూపించామన్నారు. రాజ మండ్రి నగర ప్రజల 15 ఏళ్ళ కల సాకారం చేసేందుకు గోదావరి గట్టున రివర్ ఫ్రంట్ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలోని 35 పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలాగే ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా గ్రీన్ రాజమండ్రి - ఆరోగ్య రాజమండ్రిని ప్రజలు త్వరలోనే చూస్తారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ అన్నారు. రాజమండ్రి చరిత్ర భవిష్యత్తులో నిలిచి పోయేలా కూటమి అభివృద్ధి పనులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు పెంచాలి

విశాలాంధ్ర - గోపాలపురం : పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యతగా స్వీకరించి మొక్కలు పెంచాలని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో గేల్లా రాజ్ మనోహర్ ఆధ్వ ర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పలు రకాల కాలుష్యాల కారణంగా వాతావరణంలో పెను మార్పులు నెలకొన్నాయని దాని ఫలితంగా కాలానుగుణంగా రావలసిన వర్షాలు కానీ ఎండలు కానీ వాటి వాటి కాలాల్లో ఆశించిన రీతిలో రాలేక పోతున్నాయన్నారు. గ్రామాలలో ప్రతి కుటుంబం లోనూ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వాటిని పెంచి పోషించి పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం కార్యదర్శి ఆర్ అనురాధ ఏపీవో రమణ వెలుగు ఏపిఎం రోస్ మాణిక్యం, వీఆర్వో శ్రీనివాస్, సెక్రెటరీ వాదాలకుంట కార్యదర్శి చిన్న వెంకాయమ్మ, శానిటేషన్ కోఆర్డినేటర్ సిహెచ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమెట్ట రైతులను ఆదుకోండి

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని అన్నదేవరపేట పోచవరం, గజ్జరం గ్రామాల రైతాంగానికి సాగు నీటి అవసరాలు తీర్చే పైడిమెట్ట ఎత్తి పోతల పథకం అభివృద్ధి కి తక్షణ చర్యలు తీసుకొని తాళ్లపూడి మండలం లోని నాలుగు గ్రామాల రైతులను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు ను కోరినట్లు సంబంధిత స్కీమ్ అధ్యక్షులు ముళ్ళపూడి రామచంద్రం వెల్లడించారు. సుమారు 2003 లో ఏర్పాటు చేసిన ఈ ఎత్తి పోతల పథకం పంపు హౌస్ లో 750 హెచ్.పి, 11కె.వి ట్రాన్స్‌ఫార్, మోటార్లు, పంపులు పాడై లక్ష్యం మేరకు సాగు నీటి సరఫరా జరగటం లేదని, ఇటీవల ట్రాన్స్ ఫార్మ్ ర్ కూడా కాలి పోయిందని రైతుల వ్యవసాయ అవసరాలను గుర్తించి కొత్త ట్రాన్స్ ఫార్మ్ ఏర్పాటు చేసి తదుపరి పూర్తి స్థాయి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఓ వినతి పత్రాన్ని మంత్రి నిమ్మల రామా నాయుడుకు అందచేశారు. పైడి మెట్ట స్కిం అధ్యక్షులుతో పాటు సంఘ సభ్యులు గన్నిన సత్తిబాబు, మండా గోవింద్ రైతులున్నారు.

పీ-4 సర్వే పేదల పాలిట వరం

విశాలాంధ్ర - గోపాలపురం : పీఫోర్ సర్వే పేదల పాలిట వరమని ఎంపీడీవో రాజు మనోహర్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో, కార్యదర్శు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పాత్రికేయులతో మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం మండల పరిధిలో 3445 కుటుంబాలను అతి పేద కుటుంబాలుగా(పి ఓ పి) గుర్తించామని అన్నారు. ఈ కుటుంబాల సమగ్ర అభివృద్ధికి మండల స్థాయి అధికారులు గ్రామ కార్యదర్శులు ను అనుసంధానం చేసి అభివృద్ధి వైపు ఆ కుటుంబాలను చేర్చేందుకు ప్రభుత్వం ద్వారా ఇవ్వబడిన యాప్‌లో వారి వివరాలను పొందుపరచా లన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీడీవో సువర్చల, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బంగారయ్య ఏఈ పవన్ కుమార్ ఏపిఎం రోజు మాణిక్యం ఏపీఓ రమణ కార్యదర్శి అనురాధ గ్రామ పంచాయతీల కార్యదర్శిలు పాల్గొన్నారు.

స్వామిత్వ రీసర్వేపై శిక్షణ

విశాలాంధ్ర - దేవరపల్లి : స్వామిత్వ రిసర్వేపై పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు డిజిటల్ అసిస్టెంట్లకు వీఆర్వోలకు గురువారం దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వై రాజారామ్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి రీ సర్వేపై శిక్షణ నిర్వహించామని, సమీత్వ రీసర్వేపై మండలంలోని బందపురం, చిన్నాయగూడెం, దేవరపల్లి, కురుకూరు యాదవోలు, ఎర్నగూడెం, కృష్ణం పాలెం గ్రామాల్లో ఆగస్టు ఒకటో తేదీన ఆయా గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వివరించాలని ఎంపీడీవో రాజారావు సూచించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామపం చాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను ప్రభుత్వమే ఆదుకోవాలి

– స్వరాంధ్ర సేవా సంస్థ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమండ్రి కేంద్రంగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ 27 సంవత్సరాలుగా అవసరార్థులకు, నిరాశ్రయులకు తగినంత సేవ చేస్తూ చిత్త శుద్ధితో పని చేస్తుందని స్వర్ణాంధ్ర సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. తమ సంస్థ తరపున ప్రతి రోజూ సుమారు 550 మందికి అన్నదానం చేస్తున్నామని, అయితే నాలుగు రోజుల క్రితం అన్న దానం చేస్తున్న తమ సిబ్బందిని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించడం తమకు మనస్థాపం కలిగించిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా, దాతల సహకారంతో తాము ఈ అన్నదానం చేస్తున్నామని, అయితే తమ ఈ సేవా కార్యక్రమాలకు సహకరించకపోయినా పర్వాలేదు కానీ, దానిని అడ్డుకునే ప్రయత్నం అధికారులు చేయరాదని ఆయన కోరారు. అన్నదానానికి సంబంధించి ప్రభుత్వ పరమైన అన్ని అనుమతులు తీసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే, పర్యావరణా నికి విఘాతం కలుగకుండా తాము చర్యలు తీసు కుంటామన్నారు. తాము స్వచ్ఛందంగా సేవ చేస్తుంటే ఈ రకంగా వ్యవహరించడం సరికాదన్నారు. అలాగే, ఈ అన్నదానాన్ని స్వీకరిస్తున్న వారిని మనం యాచకులుగా పరిగణించాల్సిన అవసరం లేదని, వారిని స్వీకర్త అనాలని, వారు దైవంతో సమానమన్నారు. చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ అధ్యక్షుడు అమీర్ భాషా మాట్లాడుతూ, ఇలా అన్నదానం చేస్తున్న సమాజ సేవకులను అడ్డుకుంటే, ఎవరూ సేవ చేయడానికి ముందుకురా రన్నారు. పర్యావరణానికి విఘాతం కలుగుతుందని కార్పొరేషన్ వారు భావిస్తే, ఆయా ప్రాంతాలలో రెండు వాహనాలు ఉంచితే ప్లేట్లు, ఇతర వస్తువులు వాటిలో పడవేస్తామన్నారు. ప్రభుత్వం ఆంక్షలు విధించే ముందు స్వచ్ఛంద సంస్థలు, సేవకులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనూప్‌జైన్, చైతన్య, హరికృష్ణలు కూడా పాల్గొన్నారు.

సమిష్టి కృషితో డెంగీను నివారిద్దాం

విశాలాంధ్ర - కడియం : జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవం పురస్కరించుకుని గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బీఎంపీ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో కడియం గ్రామంలో పలు వీధులలో డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించి, డెంగ్యూ పై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీ ని వెలుగుబంటి రఘురామ్ (ఉప సర్పంచ్) ప్రారంభించి మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం దోమ కాటు వలన వస్తుందని, దోమల నివారణకు ఇంటిలో, ఇంటి చుట్టుపక్కల వారం పైబడిన నిల్వ ఉన్న నీటిని గుర్తించి వాటిని శుభ్ర పరచాలని, నీటి తొట్టిలపైన ట్యాంక్ లపైన సంపుల మీద మూతలు అమర్చాలని సూచించారు.

మానవతా సేవలు మరింత విస్తృతం చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: మానవతా సంస్థ కార్యక్రమాలు మరి అంత విస్తృత పర చాలని మానవతా సంస్థ రీజినల్ అధ్యక్షుడు చంద్రయ్య ఎడిటోరియల్ బోర్డు జిల్లా అధ్య క్షుడు గంగాధర్ పేర్కొన్నారు. గురువారం దేవరపల్లి మండల మానవతా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం దేవరపల్లిలోని కేసు రాజు సీతా రామయ్య స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా మానవతా సంస్థ జిల్లా చైర్మన్ బళ్ళ సూర్య చక్రం అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో వారు మాట్లాడారు మానవతా స్వచ్ఛం ద సంస్థ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా133 మం డలాల్లో 85,000 మంది సభ్యత్వం కలిగి ఉన్నారని, మానవతా సంస్థ మండల స్థాయి సమావేశాలు ప్రతినెల ఆదివారం నిర్వహించాలని సూచించారు. దేవరపల్లి మండలానికి శాంతి రథం అంద జేసిన ప్రముఖ వ్యాపా రవేత్త కరుటూరి ధనంజను అభినందించారు. సంస్థ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. దేవరపల్లి మండల మానవతా సంస్థ అధ్యక్షునిగా బండి సూర్యప్రకాశ రావు ఉపాధ్యక్షుడిగా ఆచంట సుభాష్ చంద్రబోస్, కార్య దర్శిగా కోసంపూడి నరేష్ వర్మ, సహాయ కార్యదర్శిగా కులుకులూరి రవికుమార్, కోశాధి కారిగా తీగల లక్ష్మీనారాయణ, ఈసీ నెంబర్ విద్యా కమిటీకి నల్లమాటి లలిత వైద్యానికి ఆకుల నాగేశ్వ స్వర రావు వెరీ నైస్ కమిటీ అధ్య క్షునిగా శివరామకుమార్, ఎమర్జెన్సీకి పచ్చ రాంగోపాల్ నిమతులయ్యారు. జిల్లా కమిటీ చైర్మన్గా బళ్ళ సూర్య చక్రం వైస్ చైర్మన్గా పప్పు వెంకట రామారావు కన్వీనర్గా రామ చంద్రం రాజు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కండెపు సూర్యనారాయణ కేశిరాజు సీతా రామయ్య, రాజుకుమార్ , ఈదుపుగంటి నాగేశ్వరరావు, తీగల బలరామయ్య, సయ్యద్ అలీ కుక్కల నాగేంద్ర, తంగిళ్ళ మునేశ్వరరావు, మిరియాల వెంకటేశ్వరరావు, సింహాద్రి రామ కృష్ణ సుంకపల్లి రాము, రామరహిత మండల అధ్యక్షుడు ఫణికిషోర్ పాల్గొన్నారు.

'సీఎంఆర్ఎఫ్' ఆర్థిక బరోసా

విశాలాంధ్ర - సీతానగరం: సీఎంఆర్ఎఫ్ చెక్కులతో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక బరోసా కల్పిస్తుందని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డనేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు సంబంధించిన 13మంది బాధిత కుటుంబ సభ్యులకు బత్తుల వెంకటలక్ష్మి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అలాగే 20 సవంత్సరాలు పాటు వార్త విలేకరిగా పని చేస్తూ ఇటీవలే మృతి చెందిన జి శివ ప్రసాద్ కుటుంబ సభ్యులకు స్వయంగా కలిసి చెక్కును అందించామని అన్నారు. రాబోయే రోజుల్లో ఏ విధమైన సహాయం అయినా రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు ఎన్‌పిఐసి లింక్ చేయాలి

– తహశీల్దార్ ఏ శ్రీనివాస్

విశాలాంధ్ర - సీతానగరం: రైతుల ఖాతాలకు ఎన్‌పిఐసి లింక్ చేయాలని బ్యాంక్ అధికారులను కోరిన తహసిల్దార్ ఏ శ్రీనివాస్. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు ఆర్థిక బరోసా కల్పిస్తూ అన్నదాత సుఖీభవ పథకం నిధులను త్వరలో విడుదల చేయనున్న నేపథ్యంలో పెండింగ్‌లో రైతుల బ్యాంక్ ఖాతాలకు ఎన్ పి ఐ సి లింక్ త్వరితగతిన పూర్తి చేయాలని తహసిల్దార్ శ్రీనివాస్ బ్యాంకులకు తిరిగి బ్యాంక్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 146 మంది రైతుల ఖాతాలు ఎన్‌పిఐసి లింక్, ఇన్ యాక్టివ్ లో ఉన్నాయని అన్నారు. వీటిలో చినకొండేపూడి 20, రఘుదేవపురం 25, కాటవరం 20 ఇలా అన్ని గ్రామాలలో ఖాతాలు ఉన్నాయని అన్నారు. వీటిలో ఇప్పటివరకూ 10 మరణాలను గుర్తించామని, ఇంకా కొన్ని మరణాలు ఉండవచ్చు అని అన్నారు. కావున రైతులు అందరూ మీ గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు, విఆర్ఓల ద్వారా వివరాలను తెలుసుకొని మీ ఖాతాలను యాక్టివ్ చేసుకోవాలని కోరారు. అలాగే బ్యాంక్ అధికారులు వచ్చిన రైతులకు ఎన్‌పిఐసి లింక్ త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ సూచించారు.

క్యాన్సర్‌పై పోరులో బసవతారకం హాస్పిటల్ మద్దతు

-ఎంపీ సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతిష్ఠాత్మక బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ, సీఈఓ కె కృష్ణయ్యతో సమావేశం జరిగినట్లు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేయబోయే క్యాన్సర్ రేడియేషన్ కేంద్రానికి సాంకేతిక, వైద్య సహకారం అందించడం, అలాగే జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడం వంటి పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. అందరికీ చేరువగా నాణ్యమైన చికిత్స అందించడమే తమ లక్ష్యమని ఎంపీ సానా సతీష్ బాబు పేర్కొన్నారు. కాకినాడలో ఏర్పాటు చేయనున్న క్యాన్సర్ రేడియేషన్ కేంద్రానికి సహకారం అందిస్తామని హిందూపూర్ ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణతెలుపగా, ఈ సందర్భంగా ఎంపీ సతీష్ బాబు బాలకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంఈఓగా తుమ్మల రంగారావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ మండల విద్యాశాఖ అధికారిగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న తుమ్మల వెంకట సత్య రంగారావు గురువారం కాకినాడ రూరల్ మండల ఎంఈఓగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, పుష్పగుచ్చెం, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా క్రీడారంగంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎన్నో సేవలు అందించి ఎంతో మంది యువతకు స్ఫూర్తిప్రదాయకంగా నిలిచి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా ఏడు సంవత్సరాల పాటు సేవలందించారన్నారు. అందరితోను ఆప్యాయంగా పలకరిస్తూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేకతను తుమ్మల రంగారావు సంపాదించుకున్నారని, అలాంటి వ్యక్తి మండల విద్యాశాఖ అధికారిగా రావడం మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కేంద్ర ప్రభుత్వం క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన మై భారత్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, మోహన్ డిగ్రీ కళా శాల సహకారంతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా యువజన అధికారి గోపి మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీరామ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా అవగాహన పెరుగుతుం దని, ప్రతి విద్యార్థి దీనిపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ రాజేష్, స్టార్ట్ అప్ కంపెనీలు అంటే ఏమిటి ఎలా ఏర్పాటు చేయాలి అనే దాని పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ సుబ్బారావు, మై భారత్ సభ్యులు సత్యసూర్య, చంటిబాబు,కళాశాలసిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీకి సర్వం సిద్ధం

విశాలాంధ్ర - కాట్రేనికోన : బయోమెట్రిక్ విధానంలో వేలి ముద్రలు పడక పోవడంతో పింఛన్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎంపిడిఓ వెంకటాచలం తెలిపారు. ఇక నుంచి ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆగస్టు నెల నుంచే ఈ విధానం అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. మండల పరిధిలోని 10 వేలు 251 మందికి 4 కోట్ల 46 లక్షల యాభై రెండు వేల 500 రూపాయలను విడుదల చేశామన్నారు. గురువారం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శిలు పింఛన్ నగదును బ్యాంక్ నుండి తీసుకుని ఆయా సచివాలయం సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంశాలన్నీ ఆమోదం... సమస్యలపై ఏకరువు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఎజెండాలోని అంశాలన్నీ కౌన్సిలర్లు ఆమోదించగా అదే కౌన్సిలర్లు వార్డుల్లో ఉన్న సమస్యలపై ఏకరువు పెట్టారు. గురువారం ఇంచార్జ్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అంశం కోర్టు పరిధిలో ఉండడం, ఇప్పుడు విదేశాలకు వెళ్లడంతో రెండవ వైస్ చైర్మన్ గా ఉన్న గోకిన సునేత్ర దేవికి ఇన్చార్జి చైర్ పర్సన్ గా బాధ్యతలు అప్పగించారు. సమావేశానికి ముందుగా సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ ఇటీవల మరణించడంతో ఆయనకు సంతాపం తెలియజేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా కృష్ణ సేవలను పలువురు కౌన్సిలర్లు కొనియాడారు. ఒక నెల గౌరవ వేతనాన్ని వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో గత 2కౌన్సిల్ సమావేశాలు జరగక పోవడంతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. దీంతో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పట్టణ అభివృద్ధికి చెంది 50 అంశాలను పొందు పరిచి ఒకటి రెండు అంశాలపై చర్చించి అంశాలన్నీ ఆమోదించడం గమనార్హం. అంతకు ముందు జరిగిన జీరో అవర్‌లో సభ్యులు ఆవాల లక్ష్మీనారాయణకరణం రాజ్ కుమార్, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్ కుమార్, యార్లగడ్డ జగదీష్, పాలిక కుసుమ చంటిబాబు, కాళ్ళ శ్యామల, స్వయంబురవు వీరభద్రరావు, నేతల హరి బాబు తదితరులు మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్..వీడిలైట్ల నిర్వహణపై మండిపడ్డారు. తక్షణం పారిశుధ్య పనులను మెరుగు పరచాలని. వీధిలైట్ల నిర్వహణ మెరుగు పరచాలని ఏకరువు పెట్టారు. అలాగే పలు అంశాలపై చర్చించారు. కో ఆప్షన్ సభ్యులు మస్యం చంద్రరావు మాట్లాడుతూ ఇటీవల స్టేషన్ సెంటర్‌లో గడియార స్తంభం మంత్రి నారాయణచే ప్రారంభించారని అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాలు సంగతి ఏంటని ఇప్పుడు అవి ఎక్కడున్నాయని వాటిని ఎందుకు తొలగించారో తెలపాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ అదే ప్రాంతంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. పట్టణ ప్రజలకు నివాస స్థలాలు వేట్లపాలెం గ్రామంలో ఇవ్వడంతో అప్పట్లో ఎమ్మెల్యే పట్టణంలోనే ఇవ్వాలని ధర్నా చేశారని సంవత్సరకాలం అయినా ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఇంటి నివాస స్థలాలు చూపించకపోవడం ఏమిటని వెంటనే లబ్ధిదారులకు నివాస స్థలాలు దగ్గరలో ఇవ్వాలని చంద్రరావు అన్నారు. ఇంచార్జ్ చైర్మన్‌గా ఎన్నికైన సునేత్రాదేవిని పలువురు కౌన్సిలర్లు అభినందించారు.

'ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజేషన్' సహకారం మరువలేం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : యూఎస్ఏకి చెందిన ప్రవాస భారతీయులు ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజషన్ ద్వారా మా సంస్థ సంకురాత్రి ఫౌండేషన్‌కు మహిళా విద్యార్థుల చదువుకు చెక్కు అందజేసిన వారి సహాయాన్ని మరు వలేను అని కిరణ్ కంటి ఆసుపత్రి సంకురాత్రి ఫౌం డేషన్ అధినేత పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పెనుమర్తి గ్రామంలో ఉన్న కిరణ్ కంటి ఆసుపత్రి ఆవరణలో యుఎస్ఏకి చెం దిన ఆత్మీయ ఆర్గనైజషన్ అక్కడ ఉన్న మహిళా విద్యార్థుల శారద విద్యానికేతన్ని సందర్శించి పిల్లల బంగారు భవిష్యత్తుకు రోబోటిక్ క్లాసుల పై వారికి అవగాహన కల్పించి, అనంతరం పిల్లలు రోబోటిక్ లో రాణించాలని ఆత్మీయ. ఆర్గనైజషన్ ద్వారా రెండు లక్షల రూపాయల చెక్, అదనంగా రెండు వేల డాలర్లు కిరణ్ కంటి ఆసుపత్రి అధినేత సంకు రాత్రి చంద్ర శేఖర్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ మాకు చాలా ఎంతో ఆనందంగా ఉందని సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా చంద్రశేఖర్ వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరు పేదలకు ఉచితంగా కంటి వైద్యం, అలాగే పేద విద్యార్థినులకు శారద విద్యా నికేతన్ ద్వారా ఉచిత విద్య అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజషన్ వారి అధ్వర్యంలో ఆత్మీయ బడ్స్ ప్రోగ్రాం తరుపున గర్ల్ స్కౌట్ ఆఫ్ న్యూ జెర్సీ రేప్రేసెంట్ ఆశ్రిత నైనాల ఫండ్ సేకరణ ద్వారా రెండువేలు డాలర్స్ విలువైన రోబోట్ ఎక్విప్మెంట్ శారదా విద్యానికేతన్ వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నైనాల ఆశ్రిత, నైనాల చాతుర్య, అర్యేహి చిక్కాల, నైనాల వెంకట్, నైనాల బిందు,చిక్కాల ఆనంద్, విజయ రామిశెట్టి ఓంప్రకాష్ నక్కా, వెంకట్ ఎరు బండి, డాక్టర్ చిక్కాల పోతురాజు, సానా సతీష్ కుమార్ ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

విశాలాంధ్ర - కరప : విద్యుత్ చార్జీలు నిలుపుదొపిడి ఆపి ప్రమాదకర ఆదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కరప గ్రామంలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు పెంపుదల నిలపాలని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని ఆగస్టు 5వ తేదీన నిర్వహించే ధర్నాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘం నాయకురాలు సిహెచ్ రమణి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 9సార్లు కరెంటు చార్జర్ పెంచి 32,000 కోట్ల భారం ప్రజలపై వేసిందని ఇక బాదుడు ఉండదని చెప్పి టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది .చార్జీలు పెంపకం తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళిక హామీ ఇచ్చారు ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగలకొట్టండి అని లోకేష్ కూటమి నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మాట తప్పింది నమ్మకద్రోహం చేసింది సంవత్సర కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయాయి జనం గోగోలు పెడుతున్నారు. ఇది చాలదన్నట్టు స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నాయి. అదాని కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లను తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లని బిగిస్తున్నది. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు విధానం మార్పు విద్యుత్ పంపిణీ ప్రైవేట్కరణకు కార్పొరేట్లకు కట్టబడదానికి చేస్తున్న కుట్రలో ఇది ఒక అడుగు అని తదితర అంశాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి వీరవేణి, ఆర్ వెంకటలక్ష్మి, ఎం వరలక్ష్మి, సిహెచ్ వెంకటలక్ష్మి, బి రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట : ఎంపీపీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాకినాడ జిల్లా ఎంపీపీల సమైక్య అధ్యక్షులు, స్థానిక ఎంపీపీ గొల్లపల్లి నరసింహామూర్తి (బుజ్జి) అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఎంపీపీ ఎంపీటీసీలతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు అధిక ప్రాధాన్యమిచ్చి త్వరలో ఉచిత బస్సు ప్రయాణం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : వృద్ధాప్యం గౌరవంగా సాగాలని 60 ఏళ్లు నిండిన వారికి కూటమి ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌గా గుర్తిస్తూ గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తున్నందున సంబంధిత వార్డు లేదా గ్రామ సచివాలయాలలో సంప్రదించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధ రాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు, కార్డుల మీద సంబంధిత వ్యక్తి బ్లడ్ గ్రూపు, అత్యవసర పరిస్థితులలో సంప్రదించవలసిన ఫోన్ నెంబరు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబరు గల ఫోన్‌ను సచివాలయాలకు వెళ్ళేటప్పుడు తీసుకుని వెళ్లాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌గా ప్రభుత్వ పథకాలు పొందడానికి, ఆర్టీసీ బస్సులలో రాయితీ పొందడానికి తదితర ప్రయోజనాలు కోసం ఈ కార్డును అర్హత గల ప్రతి ఒక్కరు తీసుకోవాలని బుద్ధ రాజు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

మండలానికి 184 స్పౌజ్ పెన్షన్లు

విశాలాంధ్ర - కరప : ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రతి నెల ఒకటో తేదీన ఇవ్వడం జరుగుతుంది. కరప మండలంలో కొత్తగా 184 వితంతు పెన్షన్లు అందించడం జరుగుతుందని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ పేర్కొన్నారు. ఆగస్టు ఒకటో తేదీన ఈ పెన్షన్లను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

3న విశాఖలో జీ తెలుగు ఆధ్వర్యంలో

జీ రైటర్స్ రూమ్ సెలక్షన్స్

విశాలాంధ్ర - కాకినాడ: ఆసక్తికరమైన, ఆలోచనలు రేకెత్తించే కథలతో బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఔత్సాహిక రచయితలకు గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. జీ రైటర్స్ రూమ్ కేవలం ప్రతిభను వెలికితీసే ప్రయత్నం మాత్రమే కాదు ఇది 'యువర్స్ ట్రూలీ జీ' అనే కంపెనీ బ్రాండ్‌తో ప్రారంభమైన ఒక సృజనాత్మక ఉద్యమం. ఈ కార్యక్రమం జీ అన్ని ప్లాట్‌ఫామ్‌లలో కథలను మరింత సమర్ధవంతంగా మార్చడమే లక్ష్యంగా మొదలైంది. సరికొత్త దృక్పథాల కోసం పెరిగిన డిమాండ్ నేపథ్యంలో, సృజనాత్మకత కలిగిన రచయితలను గుర్తించడంతోపాటు సృజనా సామర్థ్యం, రచయితల వృత్తిగత ప్రపంచం మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఎంపికైన రచయితలకు విస్తృతమైన 'జీ' సంస్థలోని టీవీ, డిజిటల్, సినిమా ప్లాట్‌ఫామ్‌ల కోసం సమర్థవంతమైన, ఆకర్షణీయమైన కథలను రూపొందించే అవకాశం లభిస్తుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న జీ రైటర్స్ రూమ్ కార్యక్రమంలో భాగంగా జీ తెలుగు ఆగస్టు 3న విశాఖపట్నం వేదికగా రచయితలను ఎంపిక చేయనుంది. ఈ సెలక్షన్స్ విశాఖపట్నంలో బొదర రోడ్, యూనిటీ డిగ్రీ కాలేజీలో ఆగస్టు 3న ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తెలుగు రచయితలను ప్రోత్సహించడమే లక్ష్యంగా జీ తెలుగు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, జీ తెలుగు, తమిళం, జీ%జు%5 తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు తెలిపారు.

పోష్‌యాక్ట్‌పై ప్రతి మహిళకు అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి సునీత అధ్యక్షతన మహిళ సాధికారిత కమిటీ ఆధ్వర్యంలో పోష్ ఎక్ట్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ వివిధ రంగాలలో పనిచేసే ప్రదేశాలలో మహిళల పై లైంగిక దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని ఈ లైంగిక దాడుల గుర్చి ప్రొటెక్షన్ ఆఫ్ సెక్సువల్ హర్రాస్మెంట్ యాక్ట్ (పోష్) ఉన్నాదనే విషయం ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని, అవసరమైనప్పుడు భయపడకుండా ఇంటర్నల్ కమిటీకి తెలియపరచాలని స్వేచ్ఛ, సురక్షితమైన వాతావరణంలో బ్రతికే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని అటువంటి చట్టాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఏలేశ్వరం అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు నూకరాజు మాట్లాడుతూ ఏమైనా ఇబ్బంది కలిగినప్పుడు మీ ఇంటర్నల్ కమిటీకి తెలియపరిచి ఉండాలని, తరువాత సమాచారం సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు కె సురేష్, డా మదీనా, డా శివ ప్రసాద్, విమెన్ ఎమ్పవర్మెంట్ కన్వెనర్ లక్ష్మి, వీరభద్ర రావు, డా బంగార్రాజు, సతీశ్, రాజేశ్, ఉమెన్ ఎమ్పోవెర్మెంట్ సభ్యులు కుమారి మేరీ రోజలీనా, పుష్పా, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్ధిని, విద్యార్దులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - రావులపాలెం : ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లు అర్హులైన వారందరికీ అందిస్తున్నా మని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నూతనంగా 763 వితం తువు (స్పౌజ్) పింఛన్లు 3,052,000 మంజూర య్యాయని అన్నారు. పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు పింఛన్ ఇచ్చే విధానాన్ని గత వైకాపా ప్రభు త్వం విస్మ రించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధా నాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో 2019 నుంచి 2024 అక్టోబర్ మధ్య భర్తను కోల్పోయిన వితంతు పింఛను కోసం వేచి చూస్తున్న మహిళలకు ఈ పింఛను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కుందన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో ఆగస్టు నుంచి కొత్తగా వితం తువు (స్పౌజ్) కేటగిరీలో 763 పింఛను మంజూరు అయినట్లు తెలిపారు. రావులపాలెం మండలం నుండి ఒక దయాలసిస్ పింఛను 10000 మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - రాజమండ్రిసిటీ : ఆర్.బి.ఐ గైడెన్స్ ప్రకారం ప్రతి బ్యాంక్ , ఏటీఎంల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ అన్నారు. బ్యాంకు విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆయన అన్నారు. గురువారం జిల్లాలోని వివిధ బ్యాంకుల అధికారులు , సెక్యూరిటీ అధికారులతో బ్యాంకులు, ఏటీఎంల వద్ద తీసుకోవలసిన భద్రతా పరమైన అంశాల గురించి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి బ్యాంకు, ఏటీఎం ల వద్ద పనిచేసే నైట్ విజన్ హెచ్‌డి సీసీటీవీలను అమ ర్చుకోవాలని, ఫైర్ సెక్యూ రిటీ పరికరాల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని, ఫిజికల్ సెక్యూరిటీ పరంగా బ్యాంకులు , ఏటీఎంల వద్ద గల కిటికీలకు గ్రిల్ గేట్లు స్ట్రాంగ్ గా ఉండే విధంగా చూసుకోవాలని, షట్టర్లకు నాణ్యత కలిగిన తాళాలు ఉపయోగిం చాలన్నారు. బ్యాంకు సిబ్బంది పోలీసు సిబ్బందితో సంబంధాలు ఏర్పరుచుకోవాలని, అత్యవసర సమ యాలలో సంప్రదించడానికి వీలుగా పోలీసు అధి కారుల కాంటాక్ట్ డీటెయిల్స్ కలిగి ఉండాలన్నారు. ఎక్కువగా ట్రాన్సాక్షన్స్ జరుగుతున్న వారి ఖాతాలను వెరిఫై చేయాలని, అనుమానం వస్తే, వారి వివరాలు పోలీసులకు తెలియచేయాలన్నారు. జోనల్ డీఎస్పీలు క్రమం తప్పకుండా వారి పరిధిలో గల బ్యాంక్, సెక్యూరిటీ అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, బ్యాంకు ఎటిఎం చుట్టుపక్కల బీట్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ, సెక్యూరిటీ గార్డులను, వాచ్మెన్లను అలర్ట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.ఎం మురళి కృష్ణ, అడిషనల్ (ఎస్పీ లా అండ్ ఆర్డర్) ఏవి సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) ఎల్. అర్జున్, డి.ఎస్.పి(ఎస్ బి) బి. రామ కృష్ణ, జోనల్ డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు ఇతర పోలీసు అధికారులు, బ్యాంక్అధికారులు, సెక్యూరిటీ అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు వేగవంతం

విశాలాంధ్ర - నిడదవోలు : పట్టణంలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశహాలులో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. అజెండాలో తెలిపిన అభివృద్ధి పనులలో వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ల వార్డులకు నిధులను కేటాయించకపోవడంతో వైసీపీ కౌన్సిలర్లు నల్ల రిబ్బన్లను ధరించి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావే శంలో అధికారులు అజెండాను చదివి వినిపి స్తుండగానే వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ కామిశెట్టి సత్తిబాబు, వైస్ చైర్మన్ యలగడ బాలరాజు వైసిపి కౌన్సిలర్లకు సంబంధించిన 13వార్డుల్లోనూ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడంతో అభ్యంతరం వ్యక్తపరిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తూ సమావేశం నుండి వాకౌట్ చేసి నిరసనను వ్యక్తపరిచారు. అనంతరం రూ 78.50 లక్షలతో ప్రతిపాదించిన 16 పనులను కౌన్సిల్ గంగుల వెంకటలక్ష్మి అభ్యర్థన మేర కు సమావేశంలో మిగిలిన కౌన్సిలర్లు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ నిధులు కోటి రూపాయలు మంజూరుగాక సీసీ కెమెరాలు ఏర్పాటు రూ70 లక్షల కేటా యించారన్నారు. రూ 30 లక్షలు మిగు లు నిధులు ఉండగా, నిడదవోలు శాసన సభ్యు లు కందులు దుర్గేష్ కృషి ఫలితంగా మున్సిపల్ శాఖమంత్రి అదనంగా మరో రెండు కోట్లు కేటాయించడానికి ఆమోదం తెలిపా రని నిధులు కేటాయింపునకు ప్రతి పాద నలు పంపమన్నారు. నిధులు మం జూరు కాగానే అన్ని వార్డులోనూ అత్యవసర ప్రతి పాదికన నిధులు కేటాయించి పనులు నిర్వ హించనున్నట్టు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 59.63 లక్షలు షరతులతో కూడిన పనులు నిర్వహించేందుకు ప్రతిపాద నలు సిద్ధం చేశామన్నారు. మున్సిపల్ చైర్పర్సన్‌గా పట్టణంలో అన్ని వార్డులోనూ అభి వృద్ధి తనకు ముఖ్యమని నిధులు కేటాయిం పులో ఎటువంటి పక్షపాతం ఉండదని తెలి పారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజు పరిచయంతో కౌన్సిల్ సమావేశం ముగిసింది.

దోమలు వ్యాప్తికి నివారణా చర్యలు

విశాలాంధ్ర - రాజోలు : తాటిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఫణి కుమార్, డా దివ్యదర్శిని ఆధ్వ ర్యంలో గురువారం యాంటీ డెంగ్యూ ర్యాలీ నిర్వహించారు. రాజోలు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ఆరోగ్య సిబ్బందితో దోమల నివారణ పై ప్రతిజ్ఞ చేయించారు. పిహెచ్‌సి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులను ప్రారంభించిన

శ్రీ భారతి విద్యా సంస్థల అధినేత సుంకర వీరబాబు



విశాలాంధ్ర - ప్రత్తిపాడు : విలువలతో కూడిన విద్యను అందించడమే శ్రీ భారతి విద్యా సంస్థల లక్ష్యమని ఆ సంస్థల అధినేత సుంకర వీరబాబు చెప్పారు. మండలంలోని రాచపల్లి అడ్డరోడ్డు వద్ద అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర ఆలయంలో భారతి విద్యా సంస్థలు నూతనంగా కొనుగోలు చేసిన రెండు స్కూలు బస్సులను గురువారం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య పూజలు నిర్వహించి ఆ విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు ప్రారంభించారు. నేటి పోటీ ప్రపంచానికి అనుకూలంగా విద్యార్థుల సామర్థ్యాలు పెంపుదల విద్యాభివృద్ధి లక్ష్యంగా తమ విద్యాసంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ఆయన తెలిపారు.

ప్రజల ఆశలను నేరవేరుస్తున్న "చంద్రబాబు"

-459 కొత్త స్పౌజ్ పెన్షన్లు మంజూరు

-కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే "పిల్లి"

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సం క్షేమ పథకాల అమలులో ముందుండి ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొస్తోందని కాకినాడ రూరల్ నియోజక వర్గంలో 459 నూతన స్పౌజ్ పెన్షన్లు మంజూరు అయ్యాయని కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే "పిల్లి" దంపతులు తెలిపారు. నియోజక వర్గంలో పలు గ్రామాల్లో పర్యటించిన కో ఆర్డినేటర్ పిల్లి సత్య నారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు ఆయా గ్రామాల నాయ కులకు పెన్షన్ మంజూరు అయిన లబ్ధిదారుల వివరాలను అందించి ఆగస్ట్ 1న పింఛన్ పంపి ణీలో పాల్గొనాలని సన్నద్ధం చేశారు. ఈ సందర్భంగా పిల్లి దంపతులు మాట్లాడుతూ ముందస్తుగా వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి తమ కార్యకర్తల ద్వారా అర్హులైన వారి నుండి నియోజక వర్గంలో ప్రతీ గ్రామం నుండి దరఖాస్తులు స్వీకరించామన్నారు. వాటన్నిటిని గ్రామంలో ముఖ్య నాయకులు ద్వారా ఆయా గ్రామాల సచివాలయాల్లో దరఖాస్తు చేయిం చామని అందులో భాగంగా నియోజక వర్గంలో కరప మండలంలో 184, రూరల్ లో 275 మందికి ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ పెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వామపక్షాలు, ప్రజాసంఘాల ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యా లయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను తక్ష ణమే తొలగించాలని, భవిష్యత్తులో వ్యాపార సంస్థలకు, గృహాలకు గాని స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయకూడదని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, నాగేశ్వరరావు, కేవివి సత్యనారాయణ, సిహెచ్ సాంబశివకుమార్, జీవిఎస్ రెడ్డి, ఎం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు సత్యనారాయణ, వినోద్, కమలాకర్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

విశాలాంధ్ర - కైకలూరు : విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావద్దని కైకలూరు రూరల్ ఎస్ఐ.రాంబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలో భుజబలపట్నం హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ. రాంబాబు మాట్లాడుతూ డ్రగ్స్ వలన విద్యార్థులు తమ జీవితాలను పాడు చేసుకోవద్దని, డ్రగ్స్ వాడుకోవడం వల్ల విద్యార్థి దశలో అనేక దుష్పరిణామాలు ఉంటాయని, అందువలన జీవితాన్ని పాడు చేసుకోవద్దని తెలిపారు. సైబర్ క్రైమ్ గురించి అందరికీ అవగాహన ఉండాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులు అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. ఆన్లైన్లో మోసాలు జరిగితే సైబర్ క్రైమ్ దయల్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, డ్రగ్స్ గురించిన దయల్ ఫ్రీ నెంబర్ 1972, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 112,నంబర్లకు ఫోన్ చేసి తమ చుట్టు పక్కల జరిగే సమాచారాన్ని ఈ నెంబర్ల ద్వారా ఫిర్యాదు చేయ వచ్చున్నారు. ప్రతిరోజు తమ స్కూల్ వద్దకు శక్తి టీం వారు వస్తారని, విద్యార్థిని లకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వారికి తెలపాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హైస్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొనండి

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల 18 రకాల డిమాండ్ల సాధనకై ఆగస్టు 2వ తేదీన తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గా రావు తెలిపారు. ఈ ధర్నాలో ఏపీటీఎఫ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ధర్నా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

సీఐ నరేష్ కుమార్‌కు ప్రశంసాపత్రం

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు సిఐ నరేష్ కుమార్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. రాజోలు సర్కిల్ పరిధిలో గల ఓఎన్జీసీ వెల్స్, రిగ్స్‌ల వద్ద జరుగుతున్న దొంగత నాలు, నేరాలను సమర్థవంతంగా ఛేదించినందుకు విజయవాడలో జరిగిన ఆన్ షోర్ సెక్యూరిటీ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈ పురస్కారం సిఐ నరేష్ కుమార్ అందుకున్నారు. ఆయనకు రాజోలు సర్కిల్ పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు

- "సుపరిపాలనలో తొలిఅడుగు"లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర - కడియం : ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లు అర్హులైన వారందరికీ అందిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలంలో గురువారం జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మంత్రి కొండపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భం గా స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, స్థానిక నేతలతో కలిసి మంత్రి కొం డపల్లి ఇంటింటి ప్రచారం నిర్వహించి,ఏడాది పాలనలో ప్రభుత్వ కార్యక్రమాలు ఇంటింటికి వివరించారు. కర పత్రాలు పంచుతూ ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాల యం వద్ద ఏర్పా టు చేసిన సభలో మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే గోరంట్ల కొత్తగా మం జూరైన వితంతు పింఛన్ల పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ పింఛను తీసుకుంటున్న భర్త చని పోతే భార్యకు పింఛన్ ఇచ్చే విధానాన్ని గత వైకాపా ప్రభుత్వం విస్మరిం చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణ యం తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో 2019 నుంచి 2024 అక్టోబర్ మధ్య భర్తను కోల్పోయిన వితంతు పింఛను కోసం వేచి చూస్తున్న మహి ళలకు ఈ పిం ఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారాలోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషితో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేం దుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలి పారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లా డుతూ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి, అప్పుల పాలు చేశారని తెలి పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారుచేసిన ఉత్పత్తులను మంత్రి కొండపల్లి పరి శీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి మోసగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, టిడిపి వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి గోరం ట్ల రవి రామ్ కిరణ్, ఎమ్మార్ పాలెం సర్పంచ్ అన్న దేవుల చంటి, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, వైస్ చైర్మన్ బోడపాటి గోపి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ, యర్ర వేణు గోపాల రాయుడు, రూరల్ బిజెపి ఇంచార్జ్ ఆకుల శ్రీధర్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ముద్రగడ జమ్మి, ఆదిమూలం సాయిబాబా, చిలుకూరి ప్రభాకర్, గెడ్డం శివ, నాగిరెడ్డి రామకృష్ణ, జంగా వినోద్, డ్వాక్రా పిడి ఎస్ వి వి ఎస్ మూర్తి, ఎంపిడిఓ కె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి : జేసీ

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఈ నెల 15వ తేదీన 79వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదే శించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధి కారులతో నిర్వహించిన సమావేశంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక లను జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయా లన్నారు. వేడుకలు నిర్వహించే పోలీస్ పెరేడ్ గ్రౌం డ్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్య లు తీసుకోవాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు, వివిఐపిలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, తాగునీటి సరఫరా, తదితర ఏర్పాటు చేయాలని సం బంధిత అధికారులకు సూచిం చారు. దేశభక్తి పెంపొందిం చేలా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్న తరహాలో అందరిని ఆకర్షిం చేలా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి బింబించే విధంగా స్టాల్స్ ఏర్పాటు, ఆయా శాఖల శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా ఉండాలన్నారు. ఆహ్వాన పత్రికలను ప్రొటోకాల్ ప్రకా రం అంద జేయాలన్నారు. జిల్లా యంత్రాంగంలోని ప్రభుత్వ శాఖల్లో ఉత్తమంగా పనిచేస్తున్న ఉద్యోగులను గుర్తించి వారి పేర్లను ప్రతిపాదించాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించాలని ఆర్టీసి పిఆర్ఓ నర్సింహారావుని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వ రరావు, సిపిఓ వాసుదేవరావు, ఎఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, డిఆర్డిఎ పిడి ఆర్.విజయరాజు,పశుసంవర్ధకశాఖ జెడి గోవింద రాజులు, డిఇఓ ఎం. వెంకటలక్ష్మమ్మ, ఎస్సీ కార్పోరే షన్ ఈడి ఎం. ముక్కంటి, డిపిఓ కె. అనురాధ, హౌసింగ్ పిడి సత్యనారాయణ,ఎపిఇడిసిఎల్ ఎస్ ఈ పి.సాల్మన్ రాజు,డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్ కుమార్, ఇరిగే షన్ ఎస్ఈ పి.నాగార్జునరావు, బి.సి.కార్పొరేషన్ ఈడిఎన్. పుష్పలత,జిల్లా బి.సి. సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి,జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, తహశీ ల్దారు గాయిత్రి, డ్వామా పిడి కె.వి.సుబ్బారావు, ఐసిడిఎస్ పిడి పి. శారద,స్కిల్ డెవలప్మెంట్ అధి కారి ఎన్. జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, డిఎస్ఓ విలియమ్స్, ఎన్.టి.ఆర్. ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డి నేటర్ డా.రాజీవ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు 'అన్నదాత సుఖీభవ' అమలు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో అర్హులైన ప్రతీ రైతుకు 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు జరిగేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం అమలుపై గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమీక్షించారు. పథకం అమలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగష్టు 2న 'అన్న దాత సుఖీభవ-పీఎం కిసాన్' కింద జిల్లాలో 1,48,000 మంది రైతులకు రూ.98.80 కోట్ల రూపాయలు అందిస్తుందన్నారు. 'అన్నదాత సుఖీ భవ-పీఎం కిసాన్' పథకం మొదటి విడతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.7వేలు అర్హులైన రైతు లకు అంది స్తుందన్నారు. అర్హుడైన చివరి రైతు వరకు 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకంను వర్తింప చేయాల న్నారు. ఈ కార్యక్రమాన్ని మండల, గ్రామ స్థాయిలో పండుగ వాతావరణంలో నిర్వహించేలా ప్రజాప్రతినిధులను, రైతులను భాగస్వామ్యు లను చేయాలన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విత్తనాలు, ఎరువులు పంపిణీ, 'అన్నదాత సుఖీభవ-పీఎం జిల్లాలో అర్హులైన వారి ఎంపిక విధా నాన్ని రైతులకు వివరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచిం చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ విజయకుమార్, ఇతర వ్యవ సాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఎన్‌పిసిఐ ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలి : జేసీ

విశాలాంధ్ర - కడియం : రైతులకు సంబంధించిన ఎన్‌పి సిఐ ఖాతాలను వెంటనే పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా నాయక్ బ్యాంక్ అధికారులకు సూచించారు. అన్న దాత సుఖీభవ పథకం అమలులో భాగంగా గురువారం కడి యం కెనరా బ్యాంకును వారు సందర్శించారు. కడియం మం డల పరిధిలో ఎన్ పి సి ఐ ఫార్మర్ ఏక్టివేషన్ కు సంబంధించి కెనరా బ్యాంకు నందు రైతుల వివరములు పరిశీలించి, 139 మంది రైతుల ఖాతాలు అమలులో లేవని, వెంటనే సదరు ఖాతాలు పునరుద్ధరించే విధముగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ కుమార్, అగ్రికల్చర్ ఆఫీసర్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించండి

జిల్లా ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ప్రేమ వివాహం చేసుకున్న తమకు..తమ పెద్దల నుంచి ప్రాణహాని ఉందంటూ ఓ ప్రేమ జంట గురువారం కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను ఆశ్రయించింది. ముఖ్యంగా తన తల్లిదండ్రులు, సోదరుల నుంచి తమకు హాని ఉందంటూ సర్పవరానికి చెందిన యాళ్ల రమ్య జిల్లా ఎస్పీకి వివరించింది. మేజర్ అయిన తాను, నవర గ్రామానికి చెందిన వాకపల్లి సాయి గణేష్‌లు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, ఈ విషయం తమ పెద్దలకు కూడా తెలుసునని, మేజర్‌నైన తాను, సాయిగణేష్ ఇద్దరూ ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామన్నారు. తనను ఎవరూ బలవం తంగా తీసుకువెళ్లలేదని రమ్య తెలిపింది. సాయిగణేష్‌పై తన తల్లిదండ్రులు పెట్టిన కేసును వెంటనే తొలగిం చాలని కోరింది. దీనిపై ఎస్పీ ప్రేమజంటకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రమ్య మీడియాతో మాట్లాడుతూ ఒకే సామాజిక వర్గానికి చెందిన తాము రెండే ళ్లుగా ప్రేమించుకుంటున్నామని, ఇరుకుటుంబాలకు ఈ విషయం తెలుసని అన్నారు. తన ఇష్ట ప్రకారమే ఈ వివాహం జరిగిందని రమ్య తెలిపింది. తన తల్లి, అన్నయ్యలు తమను ఎలాగైనా చంపాలని చూస్తున్నారని, మనుషులను పెట్టి తమ కోసం గాలిస్తున్నారని, అందువల్లే జిల్లా ఎస్పీని ఆశ్రయించాల్సి వచ్చిందని రమ్య తెలిపింది. సీఐతో చెప్పి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తానని ఎస్పీ హామీ ఇచ్చారని రమ్య, సాయిగణేష్‌లు వివరించారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు మండలం కోరంగి పోలీస్ స్టేషన్ సమీ పంలో 216 జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి. కారు కాకినాడ నుండి ఐ పోలవరం మండలం పెద మాడి గ్రామానికి వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. చనిపోయిన మహిళ మందపాటి సుభద్రమ్మ వయస్సు(67)గా గుర్తించిన పోలీసులు. కాకినాడ నుండి ఐ పోలవరం మండలం పెదమాడి గ్రామానికి చెందిన మందపాటి శ్రీరామరాజు భార్య సుభద్రమ్మ స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనా స్థలంలోనే సుభద్ర మ్మ మృతి చెందగా శ్రీరామరాజుకు స్వల్ప గాయాలు కావడంతో హుటా హుటిన స్థానికులు మరియు పోలీసుల సహకారంతో అంబులెన్స్‌లో కాకినాడ మెరుగైన వైద్యానికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని విచారణ చేపట్టిన కోరంగి పోలీసులు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ నగర కమిటీ నియామకం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరం అర్బన్ వైసీపీ నగర కమిటీని ప్రకటించారు. ఇప్పటికే నగర పార్టీ అధ్యక్షుడిగా మార్గాని భరత్ కొనసాగుతున్న నేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షులుగా మాజీ కార్పొరేటర్లు గుత్తుల మురళీధర్, చోడిశెట్టి సత్యవేణి, దుంప చంద్రారెడ్డి (రూరల్), జనరల్ సెక్రటరీలుగా కానుబోయిన సాగర్, దుర్వాసుల సత్యనారాయణ, మార్తి నాగేశ్వర రావు, మహమ్మద్ షబ్బీర్, నందం స్వామి, జువ్వల నాగేశ్వరరావు (రూరల్), కారపురెడ్డి బాబ్జిరెడ్డి (రూరల్), సెక్రటరీలుగా పులగం సుధారెడ్డి, నల్ల రామాంజనేయులు (మాజీ కార్పొరేటరు), పంపన శ్రీను, గుడాల ఆదిలక్ష్మి, కట్ట వెంకటేష్, సీరపు గణేష్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా దాసి వెంకట్రావు, ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా ముప్పన శ్రీనివాస్, లక్కోజు ఓంకార్, యాక్టివిటీ సెక్రటరీలుగా తమ్మిశెట్టి శివప్రసాద్, దమదాసు శ్యాంసుందర్, అధికార ప్రతినిధిగా రాజ్యం త్రినాథ్ లకు అవకాశం కల్పించారు.

గ్రామాల్లో చేయాల్సిన స్వామిత్వ సర్వే పై శిక్షణ

విశాలాంధ్ర-సీతానగరం: మండల వ్యాప్తంగా త్వరలో చేపట్టబోయే స్వామి త్వ సర్వే పై గురువారం డిప్యూటీ ఎంపీ డీవో కె వి ఎస్ ఎస్ ఎస్ మూర్తి ఆధ్వర్య లో మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనిలో భాగంగా త్వరలో చినకొండేపూడి, కాటవరం, మిర్తి పాడు, ముల్లకల్లంక గ్రామాలతో పట్టు ఒకే సారి రఘుదేవపురం(రాపాక), నాగం పల్లి(బీపురుపల్లి), మునికూడలి (వేదుళ్లపల్లి) రెండేసి గ్రామాలు ఒక సారి ఈ సర్వే ప్రారంభం కానుంది అని అన్నారు. ఈ సర్వేలో ఇంటి స్థలాలు, ఇళ్ళు, ఖాళీ స్థలాలను ఒక పద్ధతిలో క్రమ బద్ధించడం జరుగుతుంది అని అన్నారు. దీనికి ఇప్పటికే శిక్షణ పొందిన పంచాయితీ కార్యదర్శి కె స్టీఫెన్ గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఏ ఓ సుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు రైతులకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన

- పథకం కింద రూ.7,000 చొప్పున రైతుల ఖాతాలకు నిధుల జమ
- అన్నదాత సుఖీభవ పథకం కింద 1,13,000 మంది రైతులకు రూ .55 కోట్ల లబ్ది
- పీఎం కిసాన్ పథకం కింద 1,20,000 మంది రైతులకు రూ .24 కోట్ల లబ్ది
- అర్హత కలిగిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు కలెక్టర్ పి ప్రశాంతి
- సమాచారం కోసం వాట్సాప్ గవర్నెన్స్, కాల్ సెంటర్ లేదా రైతుసేవా కేంద్రాలను సంప్రదించండి

- కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాల కింద మంజూరైన నిధులను రేపు (ఆగస్టు 2న) అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాలో రూ.7,000 చొప్పున, జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.79 కోట్లు నేరుగా ఈ విడత లో రైతుల ఖాతాల్లో జమ చేయ నున్నట్టు తెలిపారు. రూ.7,000 మొత్తంలో రూ.2,000 పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుండగా, రూ.5,000 అన్నదాత సుఖీభవ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.20,000 లను మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చెయ్యడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ విడతలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 1,13,000 మంది రైతులకు రూ.55 కోట్లు, పీఎం కిసాన్ యోజన పథకం కింద ఒక్కొక్కరికి రెండు వేలు చొప్పున 1,20,000 మంది రైతులకు రూ.24 కోట్ల మేర రైతులకు ప్రయోజనం కలిగించ నున్నట్లు వెల్లడిం చారు. అయితే ఈ నిధులు సకాలంలో అందేం దుకు, రైతుల బ్యాంక్ ఖాతాలు (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తో అనుసంధానమై ఉండటం తప్పనిసరి అని అన్నారు. తూర్పు గోదా వరి జిల్లాలో 1,434 ఖాతాలు ఫ్రీజ×తో అను సంధానం కాలేదు, మరో 1,072 ఖాతాలు అనుసంధానమైనా "ఇన్‌ఆక్టివ్"గా ఉన్నాయనీ జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కనుక రైతులు ఈ కేవైసి చేసుకోవాలని కోరారు. రైతుల ఖాతాలకి జమ కాకపోవడం నేపథ్యంలో ఆధార్ కార్డు నెంబర్ తప్పుగా వేరొక ఖాతాకి అనుసంధానం కావడం, ఈ కేవైసి కాకపోవడం, బ్యాంకు ఖాతా మనుగడ లో లేక పోవడం తదితర కారణాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు.

అర్హత లేనీ వారు పరిశీలించుకోండి: సాగు భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చిన వారు ఆదాయపు పన్ను చెల్లించే వ్యక్తులు గ్రూప్ డి కాని కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు రాజ్యాంగబద్ధ పదవులు నిర్వహించిన వారు, నిర్వహిస్తున్న వారు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు – ఈ పథకాలకు అర్హులుకారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు నిధుల విషయంలో ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే సమీకృత కాల్ సెంటర్: 155251 వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్: 95523 00003 స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

ఆదిత్య యూనివర్సిటీ ఇఇ విభాగంలో గెస్ట్ లెక్చర్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలో గల ఆదిత్య యూనివర్సిటీ నందు ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారిచే "ఎలిమెంటరీ ఫండమెంటల్స్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్" అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రో వైస్-ఛాన్సలర్ (ఇంజనీరింగ్ & సైన్స్) డా ఎ రమేష్ తెలిపారు. ఈ సదస్సుకు అతిథిగా మైక్రో లింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజింగ్ డైరెక్టర్, వి గోవింద రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ ఈసీఈ విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్స్ ఫండమెంటల్స్ మరియు నూతన ప్రాజెక్ట్స్ ఎలా అభివృద్ధి చేయవచ్చు అనే విషయాలు వివరంగా తెలుపుతూ విద్యార్థులకు ప్రాజెక్ట్ డెవలప్మెంట్ గురించి వివరించారు. ప్రో వైస్-ఛాన్సలర్ డా ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ ఈ టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే అధునాతన ప్రాజెక్ట్ అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఎల్రక్టానిక్ డిపార్ట్మెంట్ విభాగాధిపతులు డా ఆర్‌వివి కృష్ణ మరియు సిహెచ్ జానకి దేవి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంబెడెడ్ సిస్టమ్స్ కోర్స్ ఉపయోగాలు వాటి వల్ల వచ్చే ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డా వై సుబ్బారావు, డీన్ అకాడెమిక్ డా పి రవికుమార్ కోర్ బ్రాంచ్ యొక్క విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమం అంతయు ఎల్రక్టానిక్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా జి శ్రీలక్ష్మి, వి ప్రీతి ఆధ్వర్యంలో జరిగింది.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ : అధిష్ఠానం ఎంతో నమ్మ కంతో సిటీ, జిల్లా కమిటీల్లో చోటు కల్పించినందున పార్టీని పటిష్టం చేయాలనీ, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంపి భరత్ రామ్ సూచించారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ కమిటీకి 38మందితో తాజాగా కార్యవర్గాన్ని నియమించడంతో పాటు ఏడుగురికి జిల్లా కమిటీలో స్థానం కల్పించడంతో వారంతా గురువారం వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ని కలుసుకుని కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలుచేయకుండా అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టాలన్నారు. వైసిపి నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కూటమి ప్రభుత్వం వేధిస్తూ, ప్రశ్నిస్తున్న గొంతును నొక్కేయాలని చూస్తోందని వీటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలన్నారు. అనంతరం పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు కూటమి ప్రభుత్వ తీరుని, అరాచక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. బిసి సంఘాల జె ఏసీ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీవాడలో పితాని పరామర్శ

విశాలాంధ్ర - కాట్రేని కోన : మండలంలోని లక్ష్మీవాడ గ్రామ వైఎస్ ఆర్ పార్టీ నాయకుడు విత్తనాల రాజేశ్వరరావు భార్య అర్జమ్మ అనారోగ్య ంతో మృతి చెందడంతో గురువారం కుటుంబ సభ్యులను రాష్ట్ర వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు పితాని బాలకృష్ణ పరామర్శించారు. అర్జమ్మ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. పితాని వెంట కాట్రేనికోన మండల పార్టీ అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, లక్ష్మీవాడ సర్పంచ్ చొల్లంగి వెంకటేశ్వర రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో 'పొలంబడి'

విశాలాంధ్ర-దేవరపల్లి: దుద్దు కూరు గ్రామంలో గురువారం "పొలంబడి" కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమం కాకర్ల చంద్రమౌళి పొలంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ ంలో ఏపి సి.ఎన్.ఎఫ్ సిబ్బంది ద్వారా దశపర్ణికషాయం,పాల ఇంగువ ద్రావ ణం, ఫిష్ అమినో ఆసిడ్ మూడింటిని, సమ పాళ్లలో నీటితో కలిపి డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ డెమొన్‌స్ట్రేషన్ చేసియున్నారు. డ్రోన్ ద్వారా ఇలా సేంద్రీ యంగా స్ప్రెయింగ్ చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చు అని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.కమల్ రాజ్ గారు, ఏఈఓ సంజన, వి.ఏ.ఏలు , వి. హెచ్.ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,గ్రామ రైతులు పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన

విశాలాంధ్ర-కడియం : డైరెక్టర్ ఆఫ్ హారి ట్కల్చర్ సెరికల్చర్ కె శ్రీనివాసులు కడియం మండలం కడియపులంక గ్రామంలోని సత్యదేవ నర్సరీ సందర్శించారు. నర్సరీ రైతులు తమ సమస్యలను డైరెక్టర్‌కు వివరి ంచారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఉద్యాన శాఖ ద్వారా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె వేణుగోపాల్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూని వర్సిటీ డాక్టర్ గోవిందరాజు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ లత కామేశ్వరి, హార్టికల్చర్ ఆఫీసర్ కడియం మరియు ఉద్యాన శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.